క్లుప్తంగా

58వ వార్డులో 'మా నమ్మకం నువ్వే జగన్'



పిలకవానిపాలెంలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న నాయకులు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు పిలకవానిపాలెంలో శనివారం ఉదయం చంద్రబాబుతో లేదు భరోసా.. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. వార్డు నాయకుడు పిలక అప్పలరెడ్డి గృహసారథులు, సచివాలయాల కన్వీనర్లతో కలిసి పిలకవానిలెంలో ప్రతి గడపకు వెళ్లి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పేద ప్రజల సంక్షేమం కోసం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు చంద్రబాబు మాటలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు.జగన్ మళ్లీ వస్తేనే తమకు మరింత భరోసా ఉంటుందని ప్రజలు అంతా చెబుతున్నారన్నారు.

ఎల్ అండ్ ఎం సిరీస్ ఉద్యోగులకు న్యాయం చేయాలి

మల్కాపురం: మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్‌ను హిందుస్థాన్ షిప్‌యార్డ్ బీఎంఎస్ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. షిప్‌యార్డ్‌లో పని చేస్తున్న ఎల్ అండ్ ఎం సిరీస్ ఉద్యోగులను పర్మినెంట్ చేసే విధంగా కేంద్రంతో మాట్లాడాలని కోరారు. కార్యక్రమంలో పీ నాయకులు రాము, సుధాకర్, సింహాచలం, రమేష్‌యాదవ్, నాయుడు, రామ్‌కుమార్, గోవింద్ తదితరులు ఉన్నారు.

ఓటర్ల నమోదుకు ప్రత్యేక శిబిరాలు



సెయింట్ ఆన్స్ స్కూల్ పోలింగ్ బూత్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న సిబ్బంది

విశాఖ విద్య: ఓటర్ల నమోదుకు శనివారం జీవీఎంసీ 52,90వ వార్డుల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశారు. వార్డుల పరిధిలోని అన్ని పోలింగ్ బూత్‌ల్లో ఉదయం నుంచి సాయంత్రం 5గంటల వరకు సిబ్బంది అందుబాటులో ఉండి దరఖాస్తులు స్వీకరించారు. 18 ఏళ్లు నిండిన వారు కొత్తగా ఓటు హక్కు పొందేందుకు దరఖాస్తు చేసుకున్నారు. 90వ వార్డు బుచ్చిరాజుపాలెం సెయింట్ ఆన్స్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాన్ని జోనల్ కమిషనర్ ఎం. మల్లయ్యనాయుడు పరిశీలించారు. ఆదివారం కూడా అన్ని పోలింగ్ బూత్‌ల్లో సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. దీనిపై అందరికీ తెలిసేలా సచివాలయ సిబ్బంది విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు.

సాయి మందిరంలో కార్తీక వన సమారాధన



కార్తీక సమారాధనలో పాల్గొన్న మహిళలు

విశాఖ విద్య: బుచ్చిరాజుపాలెం ఏపీఎస్‌ఈబీ కాలనీలోని షిర్డీ సాయిబాబా ఆలయ ప్రాంగణంలో శనివారం కార్తీక వన సమారాధన నిర్వహించారు. పరిసర కాలనీలకు చెందిన మహిళలు తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. కార్తీక సమారాధన సందర్భంగా మహిళలకు వివిధ పోటీలు నిర్వహించారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణ రావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

వాకర్స్ పార్కులో హెల్త్‌టాక్ రేపు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు హెల్త్ టాక్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి ఒక ప్రకటనలో తెలిపారు.

నాడు

వేసవి వచ్చిందంటే తాగునీటి ఎద్దడి. బిందె మంచినీటి కోసం ముష్టియుద్ధాలు.. శివారు ప్రాంతాల్లో అయితే గుక్కెడు నీరు కష్టమే. వీధుల్లోకి మంచినీటి ట్యాంకులు ఎప్పుడు వస్తాయోనని ఎదురు చూసే పరిస్థితి. మంచినీటి కోసం కూలి పనులు కూడా మానుకోవాల్సిన పరిస్థితి. **ఇక వాడుక నీటి కోసం అయితే ప్రైవేటు ట్యాంకర్లను ఆశ్ర యించాల్సిందే..**

నేడు

ప్రభుత్వం ప్రజలకు మౌలిక **వసతుల కల్ప**నకు పెద్దపీట వేసింది. **వేసవిలో కూడా** ప్రజలు ఇబ్బందులు పడకుండా **చర్యలు చేప**ట్టింది. ప్రతీ ప్రాంతానికి **కుళాయిలు** ఏర్పాటు చేసింది. నిర్ణీత **సమయం కేటా**యించి మంచినీరు సరఫరా చేస్తోంది. ఫలితంగా ప్రజల తాగునీటి ఇబ్బందులు గట్టెక్కాయి. తాజాగా మరో అడుగు ముందుకేసి ప్రజలకు 2 గంటల పాటు మంచినీరు అందించే యజ్ఞానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇప్పటికే పలు ప్రాంతాల్లో 24 గంటల పాటు మంచినీరు సరఫరా చేస్తుండా పశ్చిమ నియోజకవర్గంలో కూడా నిరంతరం మంచినీరు సరఫరా చేయడానికి జీవీఎంసీ ముమ్మరంగా పనులు చేపడుతోంది. ఇప్పటికే పైప్‌లైన్ పనులు పూర్తికావచ్చాయి. త్వరలో ఈ ప్రాజెక్టు పట్టాలెక్కనుంది.

ఇక 24/7 తాగునీరు



- నిరంతర మంచినీటి సరఫరా పనులు వేగవంతం
- ఇప్పటికే పైపులైన్ పనులు పూర్తి
- యల్లపువానిపాలెంలో రూ.1.16 కోట్లతో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం
- మూడు వార్డుల్లో రూ.86.36 లక్షలతో పనులు



ఇది కదా అభివృద్ధి

గోపాలపట్నం/మల్కాపురం/సింథియా/విశాఖ విద్య: తాగునీటి కష్టాల నుంచి ప్రజలకు విముక్తి లభించింది. ట్యాంకర్లతో వచ్చిన నీరు పట్టుకునే స్థాయి నుంచి వీధి కుళాయిలు,, ఇంటింటి కుళాయిలు వేసి ప్రజల ఇక్కట్లు తొలగించారు. ప్రతీ ఇంటికి కుళాయి ఉండడంతో సమయానికి మంచినీరు అందుతోంది. వీధి వీధిలో పైప్‌లైన్లు వేశారు. 24"7 ప్రాజెక్టు ద్వారా వీధుల్లో పైప్‌లైన్లు వేశారు. దీంతో చాలా మేరకు కుళాయి కనెక్షన్ కోసం నెలలతరబడి వేచి ఉండాల్సి పరిస్థితి లేకుండా పోయింది.

ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణంతో తీరిన కష్టాలు

యల్లపువానిపాలెంలో మూడేళ్ల కిందట ప్రారంభించిన ఓవర్ హెడ్ ట్యాంక్‌తో ఈ ప్రాంతంలో మంచినీటి సమస్యలు తీరాయి. దీంతో ఇక్కడి వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో సుమారు 1000కి పైగా కుటుంబాలు నివాసముంటున్నాయి. వారికి గతంలో ట్యాంకర్లతో మంచి నీటిని సరఫరా చేసేవారు. ఇపుడు కుళాయిలు రావడంతో ఇంటి వద్ద సమయానికి అనుగుణంగా నీరు పట్టుకుంటున్నారు. ఈ ట్యాంక్ నిర్మాణానికి జేఎన్ఎన్‌యూఆర్ఎం నిధులు సుమారు రూ. 1.16కోట్లు వెచ్చించారు.

అందుబాటులో రిజర్వాయర్

జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం ఏపీఎస్‌ఈబీ కాలనీ(బ్లాక్-24)లో ఉన్న రిజర్వాయరు ఎన్ఏడీ సమీపంలోని ఆరు వార్డుల ప్రజానీకం తాగునీటి అవసరాలు తీరుస్తోంది. రైవాడ, తాటిపూడి, గోస్తనీ రిజర్వాయర్ల నుంచి నీటిని పైపులైన్లు ద్వారా తీసుకొచ్చి ఇక్కడ నిల్వ చేస్తున్నారు. 1080 కిలో లీటర్లు సామర్థ్యం గల రిజర్వాయరు అందుబాటులో ఉంది. ఇక్కడ నుంచి ఎగువ ప్రాంతంలో ఉన్న బ్లాక్-23 రిజర్వాయర్‌కు 700 కిలోలీటర్లు, ఇందిరానగర్‌లో వెయ్యి కిలోలీటర్లు, లక్ష్మీనగర్-ఎఫ్ వద్ద 50 కిలో లీటర్లు, ఇ బ్లాక్ వద్ద 16 కిలో లీటర్లు, సీడీ బ్లాక్ వద్ద 160 కిలోలీటర్లు, రామకృష్ణ నగర్ వద్ద 200 కిలోలీటర్లు పంపుహౌస్ ద్వారా ట్యాంకుల్లో నిల్వ చేసి, పరిసర కాలనీలకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. బుచ్చిరాజుపాలెం రిజర్వాయర్ పరిధిలో వర్క్ ఇన్‌స్పెక్టర్‌తో పాటు 29 మంది సిబ్బంది రేయింబవళ్లు పనిచేస్తున్నారు.

900 కుటుంబాలకు లబ్ధి

నగరం నడిబొడ్డున ఉన్న పారిశ్రామిక ప్రాంత వాసులు తాగునీటికి ఎన్నో కష్టాలు పడేవారు. ఏళ్ల తరబడి తాగునీటి కోసం కష్టాలు పడిన వారి ఇబ్బందులను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎట్టకేలకు తీర్చింది. ఇంటింటికీ తాగునీటిని అందించాలనే లక్ష్యంతో నూతన పైపులైన్లు, బోర్లు, నూతన కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేశారు. దీంతో కొండవాలు, శివారు ప్రాంతాల్లోని 900 కుటుంబాలకు నూతన కుళాయిలు వచ్చాయి. దీంతో జీవీఎంసీ 40, 62, 63 వార్డుల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వార్డుల వారీగా నూతన పైప్‌లైన్ల కోసం చేసిన ఖర్చు

40వ వార్డు	60వ వార్డు	61వ వార్డు
ఏకేసీ కాలనీ	ఇందిరా కాలనీ, పక్కవీధిలో	ఇందిరా కాలనీ
రూ.10లక్షలు	రూ.27.78 లక్షలు	రూ.10.12లక్షలు
61వ వార్డు	**62వ వార్డు**	**62వ వార్డు**
వెంకన్నపాలెం	ఏఎస్ఎస్ఆర్ కాలనీ	క్రాంతినగర్
రూ.9.85లక్షలు	రూ.16 67లక్షలు	రూ.11.94లక్షలు



యల్లపువానిపాలెంలో నిర్మించిన వాటర్ ట్యాంక్



మల్కాపురంలో చేపడుతున్న పైప్‌లైన్ పనులు

తాగునీటి కొరత లేదు



మాకు తాగునీరు కొరత అనేది లేదు. గతంలో అయితే మంచినీళ్లు ఎప్పుడు వస్తాయా అని పంపుల వద్ద ఎదురుచూసేవాళ్లం. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. మా ఇంటి అవసరాలకు సరిపడా నీరు వస్తోంది. ఏదైనా సమస్య చెప్పినా సిబ్బంది వెంటనే స్పందించారు.

–ములగపాక సత్యవతి, లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్

నీటి కష్టాలు తీరాయి



గతంలో తాగునీటికి ఇబ్బందులు పడేవారం. వేసవి అయితే పనులు మానుకొని నీటి కోసం ఎదురు చూసే వాళ్లం. భవిష్యత్తు అవసరాల కోసం నిర్మించిన నూతన పైపులైన్ల ద్వారా తాగునీటి సమస్య పరిష్కరించారు. సమయానికి నీటిని అందిస్తూ ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నారు.

– లక్ష్మి, 40వ వార్డు



బుచ్చిరాజుపాలెంలోని రిజర్వాయర్



నీటి శుద్ధిని తనిఖీ చేస్తున్న సిబ్బంది



పైప్‌లైన్లకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలి



చంద్రనగర్‌లో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



ప్రజలకు బుక్‌లెట్స్ అందజేస్తున్న నాయకులు

గోపాలపట్నం: ప్రజలు మళ్లీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డినే ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారని భీమిలి నియోజకవర్గ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 89వ వార్డు భీమిలి నియోజకవర్గం చంద్రనగర్ 463 సచివాలయం పరిధిలో శనివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన స్థానిక ప్రజలతో ఆట్లాడారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. 99 శాతం హామీలు నెరవేర్చిన ఘనత ఆయనదేన్నారు. పేదలకు పారదర్శక సేవ చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నారన్నారు. అందుకే గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని తీసుకొచ్చారన్నారు. సచివాలయం వ్యవస్థ వల్ల ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయని వివరించారు. ప్రభుత్వ పథకాల కరపత్రాలను లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో క్లస్టర్ అధ్యక్షుడు అయితంశెట్టి గోపాలకృష్ణ, జేసీఎస్ క్లస్టర్ ఇన్‌చార్జి గేదెల మురళీకృష్ణ, వలంటీర్లు సచివాలయ కార్యదర్శులు, గృహ సారథులు పాల్గొన్నారు.

చురుగ్గా 'వై ఏపీ నీడ్స్ జగన్'

సింథియా: జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీ కాలనీ సచివాలయం పరిధిలో కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే... కార్యక్రమాన్ని చురుగ్గా నిర్వహిస్తున్నారు. నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ఏకేసీ కాలనీ సచివాలయం పరిధిలో జరిగిన సంక్షేమం, అబివృద్ధిని గడప గడపకు నాయకులు వెళ్లి ప్రజలకు వివరిస్తూ వై ఏపీ నీడ్స్ జగన్ బుక్‌లెట్లు అందజేస్తున్నారు. అవినీతిని సమూలంగా రూపు మాపి, సంక్షేమ పథకాలతో ప్రజలకు చేరువైన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, వలంటీర్లు, గృహసారథులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కరాటేతో బాలికలకు ఆత్మరక్షణ



ఆత్మరక్షణ తరగతులను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ సుధీర్‌కుమార్, అనురాధ

సింథియా: నౌసేనాబాగ్‌లోని కేంద్రియ విద్యాలయం ఆవరణలో శనివారం బాలికల ఆత్మరక్షణకు దోహదపడే కరాటే తరగతులను జాతీయ, అంతర్జాతీయ కోచ్ రంగారావు నిర్వహించారు. విద్యాలయం ప్రిన్సిపాల్ సుధీర్‌కుమార్, హెచ్‌ఎం అనురాధ ముఖ్య అతిథులుగా పాల్గొని బాలికలను ప్రోత్సహించారు. ఆపదలో తమను తాము ఎలా రక్షించుకోవాలో బాలికలు అవగాహన కలిగి ఉండాలన్నారు. చెడు ఎదురైనప్పుడు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో సాధారణ ఉత్పత్తి సాధనకు కృషి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి రెండు, మూడు నెలల్లో సాధారణ స్థితికి చేరేలా కృషి చేస్తున్నామని సీఎండీ అతుల్ భట్ తెలిపారు. ఇందుకు కార్మిక సంఘాలు సహకరించాలని కోరారు. ఉక్కు పరిపాలనా భవనంలో కార్మిక సంఘాలతో సీఎండీ, డైరెక్టర్లు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్వరలో రాయబరేలి వీల్ ప్లాంట్, హెచ్‌బీ కాలనీలకు సంబంధించి సానుకూల నిర్ణయాలు వెలువడే అవకాశం ఉందన్నారు. తద్వారా ఆర్థికంగా ఇబ్బందులు తగ్గుతాయన్నారు. ఉత్పత్తికి సంబంధించి సెయిల్, జేఎస్‌పీఎల్‌లతో చర్చలు జరుగుతున్నాయన్నారు. వాటిపై త్వరలో నిర్ణయం వెలువడుతుందన్నారు. సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు పెండింగ్ అంశాలను లేవనెత్తారు. దీనిపై కార్మిక సంఘాలు యాజమాన్యం తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. బ్లాస్ట్‌ఫర్నేస్-3 పునరుద్ధరణ, కార్మికులకు వేతన సవరణ తదితర అంశాలపై యాజమాన్యం తీరును విమర్శించారు. చివరకు సమావేశంలో ఎటువంటి సానుకూల నిర్ణయం వెలువడలేదని కార్మిక సంఘాల నాయకులు పెదవి విరిచారు. సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు డి.ఆదినారాయణ, కె.ఎస్.ఎన్.రావు, నీరుకొండ రామచంద్రరావు, యు.రామస్వామి, వై.మస్తానప్ప, బొడ్డు పైడిరాజు, వరసాల శ్రీనివాసరావు, గణపతిరెడ్డి, పాడి త్రినాథరావు, కొమ్మినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హైవేపై వాహనాల పార్కింగ్ వద్దు



వాహనదారుడికి సూచనలిస్తున్న ఎస్‌ఐ వాసుదేవరావు

విశాఖ విద్య: ఎన్ఏడీ ప్రాంతంలో జాతీయ రహదారిపై వాహనాలు పార్కింగ్ చేయవద్దని ట్రాఫిక్ ఎస్‌ఐ జి. వాసుదేవరావు సూచించారు. శనివారం సిబ్బందితో ఎన్ఏడీ పరిసర రహదారుల్లో వాహనాలు తనిఖీ చేశారు. హైవేపై పార్కింగ్ చేసిన వాహనాలను గుర్తించి జరిమానాలు విధించారు. వాహదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎన్ఏడీ ఏరియాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

రుక్మాకరరావుకు సత్కారం



రుక్మాకరరావును సత్కరిస్తున్న విక్టర్ ప్రసాద్

గోపాలపట్నం: అంతర్జాతీయ తైక్వాండో చాంపియన్‌షిప్‌లో సిల్వర్ మెడల్ సాధించిన ములపర్తి ప్రకాశరావుకు ఉచితంగా శిక్షణ ఇచ్చిన తైక్వాండో చీఫ్ కోచ్ పాండ్రంగి రుక్మాకరరావును ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ ఘనంగా సత్కరించారు. విజయవాడలోని కార్యాలయంలో శనివారం ఆయనను రుక్మాకరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. నిరుపేదైన ప్రకాశరావుకు ఉచితంగా శిక్షణ ఇచ్చి సొంత ఖర్చులతో విదేశాల్లో పోటీలకు తీసుకెళ్లిన ట్రోఫీలు సాధించేందుకు కృషి చేస్తున్న నేపథ్యంలో ఆయనను విక్టర్ ప్రసాద్ అభినందించారు.

'విశాఖ బాలోత్సవం' పోస్టర్ ఆవిష్కరణ

అక్కిరెడ్డిపాలెం: విశాఖపట్నంలో ఈ నెల 14, 15, 16 తేదీల్లో నిర్వహించనున్న బాలోత్సవం కార్యక్రమ పోస్టర్‌ను బాలోత్సవం, జిప్సా ప్రతినిధులు శనివారం ఆవిష్కరించారు. గాజువాక డ్రైవర్స్ కాలనీలోని సాయి విద్యానికేతన్ స్కూల్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో బాలోత్సవం అధ్యక్షుడు పిల్లలమర్రి రఘు మాట్లాడారు. పిల్లల పండుగకు అన్ని ప్రైవేట్ స్కూళ్ల నుంచి పిల్లలు పాల్గొంటారన్నారు. ఆయా స్కూల్స్ కరస్పాండెంట్స్, ఉపాధ్యాయులు పిల్లలను ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో జిప్సా అధ్యక్షుడు పాలవలస భాస్కరరావు, బాలోత్సవం ఉపాధ్యక్షుడు డాక్టర్ కె.రమాప్రభ, జిప్సా కార్యదర్శి గిరీష్ శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు

కోలాహలంగా అనుపు మహోత్సవం

విశాఖ విద్య: ఎన్ఏడీ సెంటర్ గౌరీ సేవాసంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. భక్తులు కోలాహలం నడుమ అమ్మవారి సారె ఊరేగింపుగా తీసుకొచ్చారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బీఎస్. కృష్ణ గౌరీ పరమేశ్వరుల ఉత్సవ మూర్తులను దర్శించుకొని పూజలు చేశారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ అన్నసమారాధనలో డిప్యూటీ మేయర్ శ్రీధ భక్తులకు స్వయంగా అన్న ప్రసాదాన్ని వడ్డించారు. సాయంత్రం నిర్వహించిన అనుపు మహోత్సవం కనుల పండువగా సాగింది. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కాళ్ల మోదినాయుడు, కార్యదర్శి పొలిమేర వెంకట ఆదినారాయణ, కోశాధికారి రాపేటి రమణ, గౌరవ అధ్యక్షులు దాడి రామారావు ,మహిళా కమిటీ సభ్యులు కాళ్ల పద్మావతి, ఆడారి లలిత, పొలిమేర అనురాధ, మౌనిక తదితరులు పాల్గొన్నారు.



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్



పురవీధుల్లో కాంతార వేషధారణతో నృత్యాలు

ఆకట్టుకున్న కాంతార నృత్యాలు

శ్రీగౌరీ పరమేశ్వరుల ఉత్సవాల ముగింపు సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన కాంతార నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అమ్మవారి అనుపు మహోత్సవం సందర్భంగా ఊరేగింపులో కాంతార వేషధారణలు అలరింపజేశాయి

ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వారోత్సవాలు

సింథియా: మల్కాపురం పోలీస్ స్టేషన్ ఆవరణలో జై భీమ్ బహుజన యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం భారత రాజ్యాంగ దినోత్సవ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు హార్బర్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ మోజెస్ పాల్, మల్కాపురం సీఐ దేముడుబాబును కలిసి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలను బహూకరించి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఏసీపీ మోజెస్ పాల్, సీఐ దేముడుబాబు మాట్లాడుతూ రాజ్యాంగం ప్రకారం చట్టంలో నీతి, న్యాయాన్ని అందరికీ సమానంగా అమలు చేసేందుకు పోలీస్ యంత్రాంగం తీవ్రంగా కృషి చేస్తోందన్నారు. ఇటీవల మల్కాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట వేసి, నేరాల శాతాన్ని తగ్గించామన్నారు. రౌడీ షీటర్లు మంచి మార్గంలో నడిచేలా వారికి కౌన్సెలింగ్ ఇస్తున్నామని చెప్పారు. భవిష్యత్తులో నేరాల నియంత్రణకు ప్రణాళికలను రూపొందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జై భీమ్ యూత్ అధ్యక్షుడు గుడాల ఈశ్వరరావు, కార్యదర్శి అనపర్తి సైదాసుదర్శన్, సహాయ కార్యదర్శి కాకర నరసింహరాజు, స్పోర్ట్స్ కార్యదర్శి గుర్రాల రామారావు, ఆర్గనైజింగ్ కమిటీ యమ్మల సురేష్, గోటివాడ మనోజ్, నల్ల సాయి పాల్గొన్నారు.

వైభవంగా అప్పన్న నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం అందజేశారు. పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తదితరులు కల్యాణం నిర్వహించారు.